

జలాశయంలో 29.160 టీఎంసీలు

జలాశయంలో బుధవారానికి 29.160 టీఎంసీలు ఉన్నాయి.పెన్నార్ డెల్టాకు 2,100, క్రస్ట్ గేట్ ద్వారా 500, ఉత్తర, దక్షిణ కాలువలకు 825 క్యూసెక్కులు, విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.99,000
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.8,964
మూడు శాతం జీఎస్టీతో	రూ.9,233
సవర (8 గ్రాములు)	రూ.73,864

గరిష్టం/కనిష్టం
39.3 /29.4

వాతావరణం

జిల్లాలో గురువారం వాతావరణం పాక్షికంగా మేఘావృతంగా ఉంటుంది. పగటి ఉష్ణోగ్రతలు అధికంగా ఉంటాయి. బుధవారం గాలిలో తేమ 56 శాతంగా నమోదైంది.

న్యూస్‌రీల్

అవినీతిని బయట పెట్టినందుకే అక్రమ బదిలీ

- న్యాయం జరిగే వరకు అమరణ దీక్ష
- భీష్మించిన సచివాలయ వెల్ఫేర్ సెక్రటరీ భాస్కర్



నెల్లూరు (బారకాసు): కావలి మున్సిపాలిటీ కమిషనర్ శ్రావణ్‌కుమార్ అవినీతిని ప్రశ్నించినందుకు తనను అక్రమంగా చేసిన బదిలీని వెంటనే రద్దు చేయాలని సచివాలయ వెల్ఫేర్ సెక్రటరీ భాస్కర్ డిమాండ్ చేశారు. తనకు జరిగిన అన్యాయానికి న్యాయం చేయాలంటూ కోరుతూ ఉద్యోగి బుధవారం నెల్లూరు నగర పాలక సంస్థ కార్యాలయ ఆవరణలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగం ముందు ఆమరణ నిరాహార దీక్ష చేపట్టారు. భాస్కర్ మీడియాతో మాట్లాడుతూ కావలి మున్సిపాలిటీ కమిషనర్ అవినీతిపై ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డికి తెలియజేసినందుకే తనను అక్రమంగా బదిలీ చేశారని ఆరోపించారు. కమిషనర్ అవినీతిపై ఆధారాలతో సహా మీడియా ముందు బయట పెడతానని తెలియజేశారు. ఇటీవల జరిగిన సచివాలయ ఉద్యోగుల బదిలీల్లో తనకు అన్యాయం జరిగిందంటూ ఆందోళన వ్యక్తం చేశారు. కావలి మున్సిపాలిటీ పరిధిలోని సచివాలయంలో వెల్ఫేర్ సెక్రటరీగా విధులు నిర్వర్తిస్తున్న తనని అక్రమంగా, అన్యాయంగా సూళ్లూరుపేట మున్సిపాల్టీకి బదిలీ చేశారన్నారు. తాను దరఖాస్తులో ఎంచుకున్న మూడు స్థానాల్లో ఏ ఒక్క స్థానానికి బదిలీ చేసే అవకాశం కల్పించకుండా సూళ్లూరుపేట మున్సిపాలిటీకి బదిలీ చేయడం అన్యాయమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదేమి అన్యాయమని అధికారులను అడిగితే బదిలీ చేసిన చోటకే వెళ్లాలంటూ ఆదేశిస్తున్నారన్నారు. అందుకే తనకు న్యాయం జరిగేంత వరకు ఆమరణ దీక్ష చేపడుతున్నట్లు భాస్కర్ స్పష్టం చేశారు. భాస్కర్ తనకు న్యాయం చేయాలంటూ కార్పొరేషన్ కమిషనర్ నందన్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు.

యుద్ధ నౌకకు ‘ఉదయగిరి’ పేరు

ఉదయగిరి: చారిత్రాత్మక నేపథ్యం ఉన్న ‘ఉదయగిరి’కి భారత ప్రభుత్వం గుర్తింపు కల్పించింది. ఒక యుద్ధ నౌకకు ‘ఉదయగిరి’ అనే పేరును నామకరణం చేశారు. ఎఫ్–35 పేరుతో రూపుదిద్దుకుంటున్న ఈ యుద్ధనౌకను అధికారికంగా ఆగస్టు 26వ తేదీన ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రారంభిస్తారని విశాఖపట్నం నేవీ లెఫ్టినెంట్ కమాండర్ ప్రశాంత్ వెల్లడించారు. ఈ యుద్ధ నౌక 148 మీటర్ల పొడవుతో 40 మిస్సైల్స్ ప్రయోగించేలా రూ.600 కోట్ల వ్యయంతో నౌకను తయారు చేశారు. ఇంత ప్రాధాన్యత కలిగిన యుద్ధనౌకకు ‘ఉదయగిరి’ పేరు పెట్టడంతో జిల్లా ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కిలో పొగాకు సగటు ధర రూ.205.22

మర్రిపాడు: మండలంలోని డీసీపల్లి పొగాకు బోర్డు వేలం కేంద్రంలో బుధవారం 569 పొగాకు బేళ్లను విక్రయించినట్లు వేలం నిర్వహణాధికారి రాజశేఖర్ తెలిపారు. వేలానికి 731 బేళ్లు రాగా 569 బేళ్లను విక్రయించామని, మిగిలిన బేళ్లను వివిధ కారణాలతో తిరస్కరించినట్లు తెలిపారు. కిలోకు గరిష్ట ధర రూ.280, కనిష్ట ధర రూ.159 లభించింది. వేలంలో 9 కంపెనీలకు చెందిన వ్యాపార ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రశ్నించడమే పాపం
విమర్శించడమే నేరం

‘రాజకీయాల్లో శాశ్వత మిత్రులు, శాశ్వత శత్రువులు ఉండరు’ అనేది నానుడి. ‘రాజకీయాల్లో హత్యలుండవు, ఆత్మహత్యలు తప్ప’ అనే మరో నానుడి ఉంది. ఈ రోజుకు మిత్రుడు, మరొక రోజుకు ప్రత్యర్థి అవుతాడు. ఇది రాజకీయ జీవిత సత్యం. అయితే దశాబ్దాల రాజకీయ చైతన్యం కలిగిన జిల్లాలో మహామహులు ప్రజాస్వామ్య స్ఫూర్తితో రాష్ట్ర, దేశ స్థాయిలో అత్యున్నత స్థాయిలో పదవులను అలంకరించారు. కొందరు మంత్రులుగా, మరి కొందరు ముఖ్యమంత్రి స్థాయిలో సేవలందించి, రాష్ట్రానికి కీర్తి కిరీటాన్ని అందించారు. కానీ కూటమి పాలనలో రాజకీయాలకు అర్థాలే మారిపోయాయి. ప్రతిపక్ష పార్టీ నేతలపై విచక్షణ మరిచి విమర్శలు చేయడం పరిపాటిగా మారింది. అదే ప్రతిపక్షం ప్రతి విమర్శలు చేస్తే భౌతిక దాడులు పాల్పడుతూ బిహార్ సంస్కృతికి తెర లేపుతున్నారు. మాజీమంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ఇంట్లో జరిగిన విధ్వంసం కూటమి దాష్టీక పాలనకు అద్దం పడుతోంది.



- నెల్లూరులో బిహార్ సంస్కృతికి తెర లేపిన టీడీపీ పాలకులు
- ప్రసన్న ఇంట్లో టీడీపీ మూకలు దాడి వెనుక వేమిరెడ్డి దంపతుల పాత్ర
- ఓ టీవీ చానల్‌తో మాట్లాడుతూ నిజం ఒప్పుకున్న ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి
- రాజకీయంగా విమర్శలు చేస్తే రౌడీయిజం చేస్తారా?
- విధ్వంసం వెనుక ముసుగు తొలగించిన ఎమ్మెల్యే, ఎంపీలు

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: కూటమి ప్రభుత్వంలో ప్రతి పక్షం ప్రశ్నించడమే పాపం.. విమర్శించడమే నేరమైపోయింది. ఏడాది పాలనలో ప్రభుత్వ వైఫల్యాలను, స్థానిక నేతల అవినీతి, అక్రమాలను రాజకీయ వేదికలపై నిర్దిష్టమైన ఆధారాలతో విమర్శిస్తే అక్రమ కేసులు బనాయిస్తున్న పరిస్థితి నుంచి రౌడీమూకలతో విధ్వంసానికి తెగించారు. ప్రశాంతతకు, రాజకీయ ప్రతిష్టకు మారు పేరైన నెల్లూరులో వేమిరెడ్డి దంపతులు బిహార్ సంస్కృతికి తెర తీశారు. రాజకీయ విలువలకు పాతరేసి విధ్వంసాలు సృష్టిస్తున్నారు. మాజీ మంత్రి, కోవూరు మాజీ ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ఇంట్లో బీభత్సం వెనుక టీడీపీ ఎంపీ, ఎమ్మెల్యేల కుట్రతోనే జరిగిందని చెప్పకనే చెప్పారు. రౌడీమూకల విధ్వంసాన్ని ఖండిస్తున్నట్లు చెబుతూనే తనపై ప్రసన్న చేసిన వ్యాఖ్యలకు తీవ్ర స్థాయిలో కోపాన్ని ప్రదర్శించిన ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ఓ టీవీ చానల్ ఇంటర్వ్యూలో ‘నిజం’ చెప్పేశారు. టీడీపీ కార్యకర్తలను అయితే ఆపగలిగాము కానీ అభిమానులను ఆపలేకపోయామంటూ నిజం కక్కేసి పెద్ద మనుషుల ముసుగును తొలగించారు.

వేమిరెడ్డి ఇంటి నుంచే విధ్వంస రచన?

మాజీమంత్రి పసన్నకుమార్‌రెడ్డిని పక్కాగా హతమార్చేందుకు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఇంటి నుంచే విధ్వంస రచన జరిగిందనేది స్వయంగా ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి మీడియా ముఖంగా మాట్లాడిన మాటలను బట్టి అర్థం అవుతోంది. ఓ ఎల్లో మీడియా చానల్‌కు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడుతూ ఆ ఘటనకు మాకు సంబంధం లేదంటూనే.. కార్యకర్తలను అయితే ఆపగలిగాము కానీ అభిమానులను ఆపలేకపోయామని, వెళ్లిన వారిని వెనక్కి రమ్మని చెప్పడం చూస్తే వారి ఇంటి నుంచే పక్కా ప్లాన్ రూపకల్పన జరిగినట్లు తెలుస్తోంది. సింహపురి రాజకీయ చరిత్రలో ఇలాంటి ఘటనలు ఎన్నడూ చోటు చేసుకోలేదు. ప్రజా జీవితంలో ఉన్న వారిపై ఎన్నో ఆరోపణలు వస్తుంటాయి. వాటికి కౌంటర్ ఇవ్వడం, అవసరమయితే న్యాయపరంగా చర్యలు తీసుకోవడం జరుగుతుంది. కానీ ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో మాత్రం హత్యలకు ప్రేరేపిత హింసను ప్రోత్సహిస్తున్నారని, ఆస్తుల విధ్వంసానికి పురిగొల్పుతున్న ఘటనలను జిల్లా ప్రజలు హర్షించడం లేదు. ఈ తరహా ఘటనలు ఇంత వరకు బిహార్ రాష్ట్రంలోనే జరుగుతున్నట్లు సామాజిక మాధ్యమాల ద్వారా చూస్తుంటాం. బిహార్ తరహా హింసను నెల్లూరులో పరిచయం చేయడం భవిష్యత్ పరిణామాలను చూస్తే ప్రజల్లో భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి.

ఆ గుండె ఆగి ఉంటే..

ప్రసన్నకుమార్‌రెడ్డి ఇంట్లో పనివారితోపాటు ఆయన తల్లి 85 ఏళ్ల వృద్ధురాలు శ్రీలక్ష్మమ్మ ఉంది. దాదాపు ఆరు దశాబ్దాలకుపైగా రాజకీయ కుటుంబంలో మసలిన ఆమెకు ఇలాంటి ఘటనలు ఎన్నడూ ఎదురుకాలేదు. వందలాది మంది టీడీపీ రౌడీ మూకలు ఒక్కసారిగా రెండు వైపు ద్వారాల నుంచి ఇంట్లోకి ప్రవేశించి దాదాపు అర్ధగంట పాటు సాగించిన విధ్వంసానికి భయంతో ఆ పెద్దావిడ గుండె ఆగి ఉంటే పరిస్థితి ఏమిటనే జిల్లా ప్రజల్లో చర్చ ప్రారంభమైంది. టీడీపీ గూండాలు సాగించిన బీభత్సానికి భీతిల్లిపోయిన ఆమె ప్రాణభయంతో బాత్‌రూమ్‌లో దాక్కోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. పగిలిన కిటికీ అద్దాల్లో నుంచి భయంతో దైన్యంగా చూస్తున్న ఆమె చూపులు పలువురి గుండెలు తరుక్కుపోతున్నాయి. ప్రజాస్వామ్యంలో విమర్శలకు దాడులు జవాబు కాదని వేమిరెడ్డి దంపతులు తెలుసుకోవాలని జిల్లా ప్రజలు అభిప్రాయపడుతున్నారు.



పగిలిన కిటికీ అద్దాల నుంచి భయంతో బయటకు చూస్తున్న ప్రసన్నకుమార్‌రెడ్డి తల్లి శ్రీలక్ష్మమ్మ

ప్రతి విమర్శలను తట్టుకోలేకపోయిన ఎమ్మెల్యే వేమిరెడ్డి

కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ఇటీవల మాజీ ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి అవినీతి చేశారంటూ, పర్సంటేజీల ప్రసన్న అంటూ వ్యాఖ్యలు చేశారు. దీనికి ప్రసన్నకుమార్‌రెడ్డి ఆమెను ఉద్దేశించి చేసిన ప్రతి విమర్శలు చేయడంతో తట్టుకోలేకపోయింది. ప్రసన్నకుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో ఇటీవల చేపట్టిన కూటమి ఏడాది పాలనపై వైఎస్సార్‌సీపీ ఉద్యమానికి ఊహించని స్థాయిలో ప్రజా స్పందన పెల్లుబుకింది. తాజాగా సోమవారం నిర్వహించిన ‘రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో’ కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. ప్రజాక్షేత్రంలో వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ప్రభ మసకబారుతుండడంతో జీర్ణించుకోలేకపోయిన ఆమె తన అనుచర వర్గాన్ని ప్రసన్నపైకి ఉసిగొల్పింది. ఆమె కీలక అనుచరులు గంట వ్యవధిలోనే వందల మందిని రౌడీమూకలను సమీకరించి ప్రసన్న ఇంట్లో విధ్వంసానికి ఒడిగట్టారు. ముందస్తు పథకం ప్రకారం ప్లాన్ అమలు జరిగినట్లు స్పష్టమవుతోంది. ముందుగా సీసీ కెమెరాలు ధ్వంసం చేశారు. పోలీసులు సైతం రౌడీ మూకలను చెదరగొట్టారే కానీ, అదుపులోకి తీసుకోలేదు. దీన్ని బట్టి పోలీసులకు సైతం సమాచారం ఉన్నట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

వేమిరెడ్డి దంపతుల ప్రోద్బలంతోనే దాడి

- నిందితులపై చర్యలు తీసుకోవాలి
- దర్గామిట్ట పోలీసులకు జిల్లా వైఎస్సార్ సీపీ మహిళా నేతల ఫిర్యాదు



దర్గామిట్ట పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న వైఎస్సార్‌సీపీ మహిళా నేతలు

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ప్రోద్బలంతో వారి ముఖ్య అనుచరులు, టీడీపీ రౌడీ మూకలు మాజీమంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డిని హత్య చేయాలనే ఆయన ఇంటి మీద దాడి చేశారని, నిందితులపై చర్యలు తీసుకోవాలని కోవూరు జెడ్పీటీసీ కొరవగిరి శ్రీలత, వైఎస్సార్‌సీపీ మహిళా నేతలు పోలీసు అధికారులను కోరారు. ఆమె బుధవారం రాత్రి మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు లక్ష్మీసునంద, మరికొందరు నేతలు, కార్యకర్తలతో కలిసి దర్గామిట్ట ఎస్‌ఐ రమేష్‌బాబుకు వినతి పత్రం అందజేశారు. శ్రీలత మాట్లాడుతూ సోమవారం రాత్రి 9 గంటల సమయంలో కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిల ముఖ్య అనుచరులు కోడూరు కమలాకర్‌రెడ్డి, జెట్టి రాజగోపాల్‌రెడ్డి, ఇంత మల్లారెడ్డి, పల్లా సుధాకర్‌రెడ్డి, పెనుబల్లి కృష్ణచైతన్య, గుడిహరి కుమార్‌రెడ్డి, సాయితేజరెడ్డి, గురు మహేష్ మరో వంద మందికిపైగా టీడీపీ రౌడీమూకలు నెల్లూరు సుజాతమ్మ కాలనీలోని నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ఇంట్లో విధ్వంసం సృష్టించారన్నారు. ప్రసన్నకుమార్‌రెడ్డిని చంపాలన్న ఉద్దేశంతోనే ఈ దాడి జరిగిందని, ఆయన ఆ సమయంలో ఇంట్లో లేకపోవడంతో ఇంట్లోని ఫర్నీచర్ మొదలు అన్నీ వస్తువులును, బెంజ్ కారును ధ్వంసం చేశారన్నారు. ప్రసన్నకుమార్‌రెడ్డి తల్లి శ్రీలక్ష్మమ్మతోపాటు పనిచేసే వారిపై దుండగులు భౌతిక దాడిచేశారన్నారు. విధ్వంసంలో రూ.5 కోట్ల మేర ఆస్తి నష్టం జరిగిందన్నారు. ఈ దాడి ఘటనకు సంబంధించిన వీడియోల్లో నిందితుల చిత్రాలు ఉన్నాయన్నారు. ఈ ఘటనపై అదేరోజు అర్ధరాత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ఫిర్యాదు చేసినా ఇంత వరకూ కేసు నమోదు చేయకపోవడం బాధాకరమన్నారు.

రాజకీయ చరిత్రలో చీకటి రోజు

- విమర్శలు, ప్రతి విమర్శలు ఉండాలే తప్ప ఇళ్లపై దాడులు సమాధానం కాదు
- ప్రజాస్వామ్యంలో భౌతిక దాడులు దారుణం, హేయం
- మాజీమంత్రి అనిల్‌కుమార్, మాజీ ఎమ్మెల్యేలు, వైఎస్సార్‌సీపీ నేతలు



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వైఎస్సార్ సీపీ నేతలు

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): నెల్లూరు రాజకీయ చరిత్రలో ప్రసన్నకుమార్‌రెడ్డి ఇంటిపై దాడి ఘటన చీకటి రోజు అని వైఎస్సార్‌సీపీ నేతలు ధ్వజమెత్తారు. రాజకీయాల్లో విమర్శలు, ప్రతి విమర్శలు ఉండాలే తప్ప ఇళ్లపై దాడులు చేయడం దారుణమని, హేయమన్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో బుధవారం మాజీమంత్రి అనిల్‌కుమార్‌యాదవ్, మాజీ ఎమ్మెల్యేలు మేకపాటి విక్రమ్‌రెడ్డి, కిలివేటి సంజీవయ్య, రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్సీ మేరిగ మురళి, ఉదయగిరి సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్ రెడ్డి, కాకాణి పూజిత విలేకరుల సమావేశంలో మాట్లాడారు.

ఆరు దశాబ్దాలకుపైగా రాజకీయాల్లో.. : మేకపాటి విక్రమ్‌రెడ్డి

జిల్లా నుంచి రాష్ట్ర, దేశ రాజకీయాలను శాసించిన కుటుంబాల్లో నల్లపరెడ్డి కుటుంబం ఒకటని, ఆ రాజకీయ కుటుంబ వారసుడు మాజీమంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి ఇంటిపై సుమారు 200 మందిపై దాడి చేయడం, ఇంట్లో ఉంటున్న వృద్ధురాలైన ఆయన తల్లి, పనివాళ్లను సైతం భయభ్రాంతుకు గురి చేయడం ఆత్మకూరు మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి అన్నారు. దాడి ఘటనకు సంబంధించి పూర్తి ఆధారాలు మా వద్ద ఉన్నాయన్నారు. ఇంటిపై దాడి చేసే ముందుగా ఇంట్లోని సీసీ కెమెరాలను ధ్వంసం చేశారని, సమీపంలో నివాముంటున్న కొంత మంది వీడియోలు తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేశారన్నారు. ఆ వీడియోలు చూస్తుంటే ప్రజలు భయకంపితులవుతున్నారన్నారు. దాడి ఘటనను టీడీపీ నేతలు బహిరంగంగా ఒప్పుకున్నారన్నారు.

కొత్త సంస్కృతిని తెచ్చారు : రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

జిల్లాపై ఒక మంచి అభిప్రాయాన్ని చెరిపేస్తూ కూటమి నేతలు కొత్త సంస్కృతిని తెచ్చారని కావలి మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి విమర్శించారు. ప్రసన్నన్న ఇంటిపై జరిగిన దాడిని చూసి రాష్ట్ర ప్రజలు విస్తుపోతున్నారన్నారు. టీడీపీని స్థాపించిన ఎన్టీ రామారావుతో కలిసి దివంగత నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి పని చేశారన్నారు. ఆయన తదనంతరం ప్రసన్నన్న ఆరు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన వ్యక్తన్నారు. ఆయన్ను అంతమొందించాలనే దురుద్దేశం కనబడుతుందన్నారు. ఆయన ఇంటిపై దాడి జరిగితే కేసు నమోదు చేయలేదని, మహిళలను తిట్టారని పోలీసులు కేసు నమోదు చేయడం ఎంత వరకు సమంజసమన్నారు. కావలిలో తనపై సైతం అక్రమ కేసులు పెట్టారని, అధికారం ఉందని ఇష్టమొచ్చినట్లు ప్రవర్తించకూడదన్నారు.

- ఎమ్మెల్సీ మేరిగ మురళీ మాట్లాడుతూ లౌకిక వాదం, భిన్నత్వంలో ఏకత్వానికి నెల్లూరుకు మంచి పేరుందన్నారు. నెల్లూరు సంస్కృతిని అందరూ కొనియాడుతుంటే మాజీమంత్రి ప్రసన్న ఇంటిపై దాడితో ఆ సంస్కృతి మారిపోయిందన్నారు. ఈ దాడిని చూస్తుంటే ముందస్తుగా ప్రసన్నన్నను హత్య చేసే కుట్ర కోణం కనిపిస్తుందన్నారు. సుత్తులు, రాడ్లతో ఇంట్లోని ప్రతి వస్తువును ధ్వంసం చేస్తే అదే ఇంట్లో మనుషులు ఉంటే చంపే వారన్నారు. ఇంట్లో ఉన్న పెద్ద అమ్మ ఉందనే విషయం మరిచి రూంలో బంధించి దాడి చేయడం దారుణమన్నారు.

దాడి ఘటనతో జిల్లా ఉలికిపడింది : అనిల్‌కుమార్

నల్లపరెడ్డి ఇంటి మీద దాడి ఘటనతో నెల్లూరు జిల్లా ఉలికి పడిందని మాజీ మంత్రి అనిల్‌కుమార్ యాదవ్ అన్నారు. వీపీఆర్ దంపతులు ప్రశాంతమైన నెల్లూరును ఫ్యాక్షన్ ప్రాంతంగా మార్చేశారన్నారు. కూటమి ప్రభుత్వంలో ప్రణాళికాబద్ధంగా ఒకరి తరువాత ఒకరిపై కేసులు, దాడులు జరుగున్నాయన్నారు. కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి దీనిపై ఎల్లో మీడియాలో చేసిన వ్యాఖ్యల్లోనే ప్రసన్నను చంపాలనే ఉద్దేశం బయటపడిందన్నారు. ప్రసన్నన్న తల్లితో పాటు పనివారిని ప్రాణభయంతో వణికిపోయేలా చేసి, ప్రసన్న తనకు తానే దాడులు చేయించుకున్నారని ప్రశాంతమ్మ ఆరోపణలు చేయడం సిగ్గుచేటు అన్నారు. సీసీ ఫుటేజీని పరిశీలిస్తే ప్రసన్నను అంతం చేయాలనే లక్ష్యం కనిపిస్తోందన్నారు. జరిగిన దారుణ ఘటనపై స్పందించక పోగా పవన్ ట్వీట్ చేయడం సిగ్గుచేటు అన్నారు. టీడీపీ కన్వీనర్లు, నాయకులే దాడులు చేస్తే వారిని అరెస్ట్ చేయకుండా ప్రసన్నపైనే కేసులు పెట్టడం దారుణం కాదా అన్నారు. వీపీఆర్ దంపతులతో పాటు, దాడికి పాల్పడిన వారిపై కేసులు ఎందుకు పెట్టరు, కుట్రదారులపై హత్యాయత్నం కేసు పెట్టాలన్నారు. గతంలో మాజీ మంత్రి రోజాను ఇంకా చాలా మంది వైఎస్సార్‌సీపీ మహిళలపై తప్పుగా మాట్లాడ లేదా, మరి అప్పుడు మేము దాడులు చేయలేదే అన్నారు.



కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపించినందుకే అక్రమ కేసులు

నా పాత్రపై ఆధారాలు చూపించండి

- సాక్షులను భయపెట్టి, బెదిరించి స్టేట్‌మెంట్లు తీసుకుంటున్నారు
- నేను తప్పు చేశానని స్పష్టమైన ఆధారం ఒక్కటున్నా నేను ఏ శిక్షకైనా సిద్ధమే
- కనుపూరు చెరువులో అక్రమ గ్రావెల్ తరలింపు కేసులో పోలీసులను ప్రశ్నించిన మాజీ మంత్రి కాకాణి
- కాకాణి ప్రశ్నలకు సమాధానమివ్వలేక నీళ్లు నమిలిన పోలీసులు

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: కూటమి ప్రభుత్వ వైఫల్యాను ప్రశ్నించమే నేరంగా నాపై ఎన్నో అక్రమంగా కేసులు పెడుతున్నారు. ఆ కేసుల్లో పోలీసులు నా పాత్ర ఉన్నట్లు ఏ ఒక్క ఆధారం చూపించినా నా తప్పు ఒప్పుకుని ఏ శిక్ష కైనా సిద్ధం అంటూ పోలీసులకు మాజీమంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి సవాల్ విసిరారు. సాక్షులను బెదిరించి, భయపెట్టి నన్ను కేసుల్లో ఇరికిస్తున్నారంటూ పోలీసులపై ఫైర్ అయినట్లు సమాచారం. కనుపూరు చెరువులో అక్రమంగా గ్రావెల్ తరలించారని నమోదు చేసిన అక్రమ కేసులో విచారణ నిమిత్తం వెంకటాచలం పోలీసులు బుధవారం కస్టడీకి తీసుకున్నారు. న్యాయవాది కటారి విద్యాసాగర్‌రెడ్డి సమక్షంలో పోలీసులు తొలి రోజు కాకాణిని 30 ప్రశ్నలు అడిగారు. అన్నింటికి దీటుగా సమాధానాలు చెప్పినట్లు తెలుస్తోంది. గ్రావెల్ తరలింపు కేసులో నాపాత్ర ఎందుకు ఉంటుంది. ఆరోపణలు చేయడం, వాటి ఆధారంగా కేసులు నమోదు చేయడం, నిందితులను బెదిరించి, భయపెట్టి చెప్పించడం తప్ప నా పాత్రపై పోలీసులు వద్ద ఏదైనా స్పష్టత ఉందా. ఏదైనా ఆధారం ఉంటే చూపిస్తే నేను స్పదించగలను. మంత్రిగా నా బాధ్యత ఏముంటుంది. ఏదైనా పత్రికల్లో కానీ, సోషల్ మీడియాలో ఏదైనా వార్తలు వస్తే అధికారులకు తగు చర్యలు తీసుకోమ్మని కోరడం, నాకు తెలిసిన బుజ్జయ్య నాయుడు కనువూరు చెరువు మట్టి అక్రమంగా తరలిస్తూ అతని టిప్పర్ ఒక వ్యాన్‌ను ఢీకొట్టి కొంత మంది చనిపోయారు. అప్పుడు పోలీసులు కేసు నమోదు చేశారు. బుజ్జయ్యను స్టేషన్‌కు తీసుకురాగా ఆయన అక్కడినుంచి తప్పించుకుని హైకోర్టుకు వెళ్లి బెయిల్ తెచ్చుకున్నాడు. బుజ్జయ్య నాయుడు టీడీపీ నాయకుడు. సోమిరెడ్డికి ప్రధాన అనుచరుడిగా చెలామణి అవుతున్నాడు. నేను ఎప్పుడూ నిబంధనలు వ్యతిరేకించి విరుద్ధంగా పని చేయమని అధికారులెవరికి చెప్పలేదు. ప్రభుత్వ నిబంధనలు ప్రకారం నడుచుకోవడం అధికారుల పని. చట్ట వ్యతిరేక కార్యకలాపాలను అడ్డుకోవడం పోలీస్ శాఖ బాధ్యత. ఇలాంటి బాధ్యతలను నాకు ఆపాదించడం ఎంత వరకు సబబు అని పోలీసులను ప్రశ్నించారని సమాచారం. కాకాణి అడిగిన ప్రశ్నలకు పోలీసులు సమాధానం చెప్పలేక నీళ్లు నమిలినట్లు తెలిసింది.

మొదటి రోజు కాకాణి విచారణ పూర్తి

నెల్లూరు (లీగల్): మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని వెంకటాచలం ఇన్‌స్పెక్టర్ పి.సుబ్బారావు మొదటి రోజు విచారించారు. కనుపూరు చెరువులో అక్రమంగా గ్రావెల్ తవ్వారని నమోదైన అక్రమ కేసులో జిల్లా కేంద్ర కారాగారంలో జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్న కాకాణిని కోర్టు అనుమతితో వెంకటచలం పోలీసులు రెండు రోజుల విచారణ నిమిత్తం బుధవారం జిల్లా పోలీస్ శిక్షణ కేంద్రానికి తరలించారు. న్యాయవాది కాటూరు విద్యాధర్‌రెడ్డి సమక్షంలో గోవర్ధన్ రెడ్డిని వెంకటచలం పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ పి.సుబ్బారావు 30 ప్రశ్నలు అడిగారు. వెంకటాచలం మండలం ఇడిమేపల్లి వీఆర్‌ఓ దేవరపాటి నాగేంద్ర బాబు, కురిచెర్లపాడు వీఆర్వో కవరగిరి వినయ్ మధ్యవర్తుల సమక్షం విచారణ జరిగింది. సాయంత్రం 5 గంటలకు కాకాణిని జిల్లా కేంద్ర కారాగారానికి తరలించారు.

కరేడు రైతులకు అండగా నిలవాలి

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు



కందుకూరు: బలవంతపు భూసేకరణకు వ్యతిరేకంగా కరేడు గ్రామ రైతులు చేస్తున్న పోరాటానికి సీపీఎం శ్రేణులు ప్రత్యక్షంగా మద్దతు తెలిపి అండగా నిలవాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు సూచించారు. బుధవారం స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో జరిగిన సీపీఎం నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ మాట్లాడుతూ ఉద్యమాన్ని తీవ్రతరం చేసేందుకు కృషి చేయాలన్నారు. సీఐటీయూ జిల్లా కె.అజయ్‌కుమార్ మాట్లాడుతూ సీపీఎం, సీఐటీయూ శ్రేణులు నిరంతరం రైతుల వెంట ఉండి వారికి అండగా ఉండాలన్నారు. కార్యక్రమంలో రైతు సంఘ రాష్ట్ర ప్రధానకార్యదర్శి కె. ప్రభాకర్‌రెడ్డి, సీనియర్ నాయకులు ముప్పరాజు కోటయ్య, గుడ్లూరు, ఉలవపాడు మండలాల ప్రాంతీయ కమిటీ కార్యదర్శులు జీవీబీ కుమార్, ఎస్‌ఏ గౌస్, నాయకులు మాదాల రమణయ్య, దువ్వూరి జాన్, పొందూరి కొండమ్మ, పొన్నం రామలక్ష్మమ్మ, కత్తి సుజాత, ఎం.లలితమ్మ, దాసరి రామ్మూర్తి, ఎస్‌కే మున్వర్ సుల్తానా, టి.వెంకట్రావు, ఎస్‌కే మల్లిక, ఎం.పద్మ, షేక్ ఆస్మా, అనూరాధ, పొట్లూరి రవి పాల్గొన్నారు.

నిమ్మ ధరలు (కిలో)

పెద్దవి : రూ.25
సన్నవి : రూ.15
పండ్లు : రూ.5

కరేడుకు సీపీఐ రామకృష్ణ రాక నేడు

ఉలవపాడు: రైతుల పోరాటానికి మద్దతుగా గురువారం కరేడుకు సీపీఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామకృష్ణ రానున్నట్లు కందుకూరు నియోజకవర్గ కార్యదర్శి సురేష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 4 గంటలకు రైతులతో ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొంటారన్నారు.

కోలాహలంగా..



మతపెద్దలతో కలిసి గంధం బిందెతో వస్తూ..



స్వర్ణాల తీరంలో జనసందోహం

- రొట్టెల పండగకు తరలివచ్చిన భక్తులు
- నాలుగో రోజూ కొనసాగిన రద్దీ
- బారాషహీద్ దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు

నెల్లూరు(బారకాసు): నెల్లూరులోని బారాషహీద్ దర్గాలో జరుగుతున్న రొట్టెల పండగ చివరి ఘట్టానికి చేరింది. బుధవారం వివిధ రాష్ట్రాల భక్తులు పోటెత్తారు. నగరవాసులు కూడా తరలిరావడంతో స్వర్ణాల తీరం కిటకిటలాడింది. బారాషహీదులను దర్శించుకుని ప్రార్థనలు చేశారు. కాగా పండగ గురువారంతో ముగియనుంది. నాలుగోరోజు స్వర్ణాల ఘాట్ వద్ద ఆరోగ్య, వివాహ, విద్య రొట్టెలకు డిమాండ్ ఏర్పడింది. వేలాది మంది భక్తులకు దర్గా కమిటీ అన్నదానం నిర్వహిస్తోంది.

ఆర్టీసీ, దర్గాకు పెరిగిన ఆదాయం

రొట్టెల పండగ సందర్భంగా నాలుగు రోజుల్లో ఆర్టీసీకి రాబడి పెరిగింది. అలాగే భక్తులు లక్షలాదిగా తరలిరావడంతో కానుకల రూపంలో దర్గాకు కూడా ఆదాయం సమకూరింది.

భక్తిశ్రద్ధలతో తహలీల్ ఫాతేహా

నెల్లూరు(బృందావనం): రొట్టెల పండగ ముగింపు సందర్భంగా తహలీల్ ఫాతేహా కార్యక్రమాన్ని సంప్రదాయంగా బుధవారం మధ్యాహ్నం నిర్వహించారు. ఇన్‌స్పెక్టర్, ఆడిటర్ వక్ఫ్ బోర్డు షేక్ ఖుదావన్ బారాషహీద్‌లకు బోర్డు తరఫున గంధం ప్రత్యేక బిందెలో తీసుకొచ్చి, ఖర్జూరం పండ్లతో సమర్పించారు. ముజావర్లు, ఫకీర్లు, గంధ మహోత్సవం నిర్వాహకులు, మతపెద్దల ఆధ్వర్యంలో ప్రత్యేక దువా నిర్వహించారు. అనంతరం పవిత్ర గంధం, ఖర్జూరాలను భక్తులు పంచిపెట్టారు. పండగ నిర్వాహకులు, మతపెద్దలు మాట్లాడుతూ సోమవారం అర్ధరాత్రితో ప్రారంభమైన గంధ మహోత్సవం బుధవారం నిర్వహించిన తహలీల్ ఫాతేహాతో పరిసమాప్తమైందన్నారు. సంప్రదాయంగా గురువారం ఉదయం జరిగే ఖత్మే జియారత్ (ముగింపు)తో ఐదు రోజులుగా వైభవంగా జరుగుతున్న రొట్టెల పండగ ముగుస్తుందన్నారు.

తెలుగు తమ్ముళ్లకే పాసులు

నెల్లూరు(టౌన్): రొట్టెల పండగ సందర్భంగా ప్రత్యేక దర్శనాల కోసం ఇచ్చిన పాసుల్లో అధిక శాతం తెలుగు తమ్ముళ్ల వద్దకే వెళ్లినట్లు విమర్శలున్నాయి. దీంతో బారాషహీద్‌లను దర్శించుకునేందుకు వచ్చిన వేలాది మంది భక్తులు క్యూలైన్‌లో పడిగాపులు కాశారు. స్థానికంగా ఉండే వారికి పాస్‌లు అందలేదని చెబుతున్నారు. మీడియా వర్గాలకు కూడా గతంలో మాదిరి కాకుండా తక్కువ సంఖ్యలో ఇచ్చారు. అయితే పాసుల పేరుతో కొంతమందిని క్యూలైన్లతో సంబంధం లేకుండా నేరుగా దర్గాలోకి ప్రవేశించారు. టీడీపీ నాయకులు దగ్గరుండి పంపించిన సందర్భాలున్నాయి.



క్యూలైన్‌లో కాకుండా వేరుగా దర్గాలోకి పంపిస్తున్న దృశ్యం

పురుషులు, మహిళలకు వేర్వేరుగా క్యూలైన్లు ఉన్నా ఎక్కడా పాటించలేదు. అందరిని ఒకే లైన్‌లో పంపడంతో మహిళా భక్తులు అసౌకర్యానికి గురయ్యారు. టీడీపీ నేతల తీరు కారణంగా క్యూలైన్లు రోడ్డు వద్దకు వచ్చిన పరిస్థితి ఉంది. ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటంతో తాగునీటికి ఇబ్బంది పడిన వారెందరో. కొన్నిచోట్ల క్యూలైన్‌లకు టెంట్‌లు ఏర్పాటు చేయలేదు. చిన్నపిల్లలతో వచ్చిన తల్లిదండ్రులు గంటల తరబడి ఎండలోనే నిరీక్షించారు.

కార్మిక లోకం భారీ ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న నేతలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): అఖిల భారత కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జరిగిన సార్వత్రిక సమ్మెలో భాగంగా బుధవారం నెల్లూరు నగరంలో భారీ ర్యాలీ నిర్వహించారు. లేబర్ కోడ్స్ రద్దు చేయాలని, పాత కార్మిక చట్టాలను పునరుద్ధరించాలంటూ పది సంఘాలకు చెందిన కార్మికులు కదం తొక్కారు. ఏబీఎం కాంపౌండ్ నుంచి ర్యాలీగా బయలుదేరి పుచ్చలపల్లి సుందరయ్య విగ్రహం, ఏసీ బొమ్మ సెంటర్, గాంధీబొమ్మ సెంటర్ మీదుగా మద్రాస్ బస్టాండ్ వరకు నిర్వహించారు. అక్కడ జరిగిన సభలో సీఐటీయూ నగర కార్యదర్శి నాగేశ్వరరావు, వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు బి.జయకుమార్‌రెడ్డి మాట్లాడుతూ, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి శంకర్ కిశోర్‌లు మాట్లాడుతూ కేంద్రం తీసుకొచ్చిన 4 లేబర్ కోడ్స్‌ను రద్దు చేసి పాత చట్టాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. స్కీమ్ వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలన్నారు. 10 గంటల పని విధానాన్ని రద్దు చేసి 8 గంటల విధానాన్ని అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో వివిధ సంఘాలకు చెందిన నవీన్‌కుమార్‌రెడ్డి, ప్రసాద్‌రెడ్డి, అజయ్‌కుమార్, సాగర్, యానాదయ్య, టీవీవీ ప్రసాద్, ప్రసాద్, పెంచలప్రసాద్, శ్రీనివాసులు, సూర్యనారాయణ, కత్తి శ్రీనివాసులు, మూలం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కూరలో బల్లి

నెల్లూరు(బారకాసు): నగరంలోని ఓ ప్రముఖ హోటల్లో బుధవారం కూరలో బల్లి పడిన విషయాన్ని సిబ్బంది గమనించకుండా వినియోగదారుడికి వడ్డించారు. అతను గుర్తించి ఆగ్రహం వ్యక్తం చేశాడు. దీనిపై అసిస్టెంట్ ఫుడ్ కంట్రోల్ ఆఫీసర్ వెంకటేశ్వరరావును ఫోన్‌లో సంప్రదించగా తమ సిబ్బందిని వెంటనే ఆ హోటల్‌కు పంపించి శాంపిల్ సేకరించి ల్యాబ్‌కు పంపడం జరిగిందన్నారు. హోటల్‌కు నోటీసులు అందజేయనున్నామన్నారు.

గోడ కూలడంతో..

- వ్యక్తి మృతి

కావలి(జలదంకి): పట్టణంలోని 8వ వార్డు చింతంవారి వీధిలో గోడ కూలి ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన బుధవారం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. బోగోలు మండలం సాంబశివాపురం గ్రామానికి చెందిన పాతా వెంకయ్య (55) కావలి మున్సిపాలిటీలో జరుగుతున్న సిమెంట్ రోడ్డు పనులకు కూలీగా వచ్చాడు. కాలువ తవ్వుతున్న సమయంలో పక్కనే ఉన్న పాత గోడ కూలి వెంకయ్యపై పడటంతో అక్కడికక్కడే మృతిచెందాడు. కావలి ఒకటో పట్టణ పోలీసులు ఘటనా స్థలానికి వచ్చి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎమ్మెల్యే అబద్ధాలు చెప్పడం బాధాకరం

ఉలవపాడు: భూసేకరణ విషయంలో కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు అబద్ధాలు చెప్పడం దారుణమని మాజీ ఎంపీటీసీ సభ్యుడు, 139 బీసీ కులాల జేఏసీ చైర్మన్ మిరియం శ్రీనివాసులు విమర్శించారు. ఆయన వివరాలు వెల్లడించారు. ఎమ్మెల్యే బుధవారం కరేడు ప్రాంత టీడీపీ మద్దతు రైతులను పిలిపించుకుని మాట్లాడారని, వారు తమ భూములు ఇచ్చేది లేదని తేల్చి చెప్పారన్నారు. కానీ ఇంటూరి బయటకు వచ్చి ప్రెస్‌మీట్‌లో తక్కువ రేటున్న భూములు ఇస్తామని రైతులు చెప్పినట్లు, మంచి అవకాశాలు కల్పించమని ఎస్టీలు కోరినట్లు అబద్ధాలు చెప్పారన్నారు. భూములను పరిశ్రమల వారికి కట్టబెట్టడానికి అనుకూలంగా మాట్లాడటం ఎంతవరకు న్యాయమని ప్రశ్నించారు. ప్రజల మనోభావాలను గౌరవించకుండా వ్యవహరిస్తే తిరుగుబాటు తప్పదని హెచ్చరించారు. ఓట్లు వేసిన రైతుల పక్షాన నిలబడి చిత్తశుద్ధిని నిరూపించుకోవాలన్నారు.